బీర్‌పూర్‌లో తుపాకీ కలకలం

సారంగాపూర్, జూలై 13: బీర్‌పూర్ గ్రామ శివారులో శనివారం ఓ యువకుడు బొమ్మ తుపాకీతో తిరుగుతుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించారు. తాను యూట్యూబ్ వీడియోల కోసం డమ్మి తుపాకీ తెప్పించుకున్నానని, ఇది ఫోటో షూట్ కోసం తీసుకెళ్తున్నట్లు చెప్పాడు. కాగా, ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ కుమార స్వామి తెలిపారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

జగిత్యాల రూరల్, జూలై 13: పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన ఏదుల కిశోర్(46) మండలంలోని మోతే గంగమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. కిశోర్ రూ. 5 లక్షలు అప్పు చేసి కిరాణా దుకాణం పెట్టుకున్నాడు. దుకాణం సక్రమంగా నడవక అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో కిశోర్ శుక్రవారం సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం గంగమ్మ చెరువులో మృతదేహం తేలింది. కిశోర్ భార్య భావన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో దుడ్డె మృత్యువాత

పెగడపల్లి, జూలై 13: మండల కేంద్రంలో శనివారం కుక్కల దాడిలో నేదరి పోచయ్య అనే రైతుకు చెందిన దూడ మృతి చెందింది. కాగా, గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోనాల వేడుకలు

జగిత్యాల రూరల్, జూలై 13: జగిత్యాల రూరల్ మండలం మొరపెల్లిలోని శ్రీవిద్య పాఠశాలలో శనివారం బోనాల వేడుకలు నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
TOURS & TRAVELS
★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536
PLOT FOR SALE
★YTDA Final Approved 92 Acres Mega Venture @ Bhuvanagiri Town Open Plots for Sale. Opp: Viver Hotel & Collectorate Building 100, 60, 40, 30 All CC Roads & Beautiful Parks, Avenue Plantation, Bank Loans AVL. 9949997199 / 9440415567 / 9866863131.
NT-327686
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- ఎస్పీ అఖిల్ మహజన్, ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట: ఠాణా ఆవరణలో ఎమ్మెల్యే కవ్వంపల్లితో కలిసి మొక్క నాటి నీరుపోస్తున్న ఎస్పీ

ఇల్లంతకుంట/సిరిసిల్ల రూరల్/ వేములవాడరూరల్ జూలై 13: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం ఇల్లంతకుంట ఠాణా ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి భావి తరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖరెడ్డి, సీఐ మొగిలి, ఎస్ఐ శ్రీకాంత్, మాజీ ఎంపీపీలు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, ఐలయ్య ఉన్నారు. అలాగే జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్, వేములవాడ పట్టణ, రూరల్ ఠాణాల ఆవరణలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు మారుతి, అంజయ్యతో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు.

తంగళ్లపల్లి ఠాణాలో..

సిరిసిల్ల రూరల్, జులై 13: వన మహోత్సవంలో భాగంగా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్ఐ సుధాకర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో సిబ్బంది పాలుపంచుకోవాలని కోరారు. ఇక్కడ ఠాణా సిబ్బంది ఉన్నారు.

చందుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో..

చందుర్తి,జూలై 13: చందుర్తి ఠాణాలో శనివారం నిర్వహించిన వన మహోత్సవంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి మొక్కలు నాటారు. హరితయజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న సీఐ

చందుర్తి: మొక్కలు నాటుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీకాంత్

పేదల సంక్షేమమే సర్కారు ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్
- తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్/ఎల్లారెడ్డిపేట జులై 13: పేదల సంక్షేమమే సర్కారు ధ్యేయమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో మండలానికి చెందిన 117, వీర్నపల్లికి చెందిన 34 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయాచోట్ల మాట్లాడుతూ ఎన్నికల ముందర హామీ ఇచ్చిన మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10లక్షలకు పెంపు రూ. 500 గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని గుర్తుచేశారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఆ తర్వాత అభివృద్ధిపై దృష్టిపెడుతున్నామని పేర్కొన్నారు. సమీప భవిష్యత్‌లో కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, ఆర్డీవో రమేశ్, తంగళ్లపల్లి తహసీల్దార్ వెంకటలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్లు బండి దేవదాస్‌గౌడ్, కోడూరి భాస్కర్‌గౌడ్, నాయకులు వైద్య శివప్రసాద్, పుర్మాణి మంజుల, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్, మచ్చ శ్రీనివాస్, రాంలింగారెడ్డి, సత్తు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, బైరి రమేశ్, చోటు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ రామచంద్రం ఉన్నారు.

సీతారామచంద్రస్వామి సన్నిధిలో..

గంభీరావుపేట, జూలై 13: గంభీరావుపేటలోని పురాతన సీతారామస్వామి ఆలయాన్ని ఆది శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ప్రజలపై స్వామివారి అనుగ్రహం ఉండాలని మొక్కుకున్నానని వెల్లడించారు. అనంతరం 103 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ భూపతి, నేతలు హమీద్, తిరుపతి, పర్వ హన్మాండ్లు, కటకం శ్రీధర్, పాపాగారి రాజు ఉన్నారు.

20 రోజుల తర్వాతా చెక్కులిస్తారా?

- వీర్నపల్లి మాజీ జడ్పీటీసీ గుగులోత్ కళావతి

వీర్నపల్లి, జూలై13: కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మాజీ జడ్పీటీసీ గుగులోత్ కళావతి విమర్శించారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు మంజూరైన 20 రోజుల తర్వాత ఎల్లారెడ్డిపేటలో పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. వ్యయప్రయాసాలు పడి 20 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధిదారుల ఇండ్లకే వెళ్లి చెక్కులు అందించామని గుర్తు చేశారు. ఇప్పటికైనా లబ్ధిదారుల ఇండ్లవద్దకు వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించాలని డిమాండ్ చేశారు. మారుమూల మండల ప్రజలపై చిన్నచూపు చూస్తున్న కాంగ్రెస్‌కు సర్కారుకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

రాజన్న సన్నిధిలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


రాజన్న ఆలయంలో కోడె మొక్కు చెల్లించుకుంటున్న ఎంపీ రఘునందన్‌రావు

వేములవాడ టౌన్, జూలై 13: వేములవాడ రాజన్న ఆలయాన్ని శనివారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు సమర్పించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. అర్చకులు నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం చేశారు. పర్యవేక్షకుడు తిరుపతిరావు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహకారంతో రాజన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. వెంట బీజేపీ జిల్లా, పట్టణాధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, రేగుల సంతోష్‌బాబు, ఆలయ ఏఈవో ప్రతాప నవీన్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఇన్స్‌పెక్టర్ చెక్కిళ్ల అశోక్ ఉన్నారు.

ఉరేసుకొని పారిశుధ్య కార్మికుడి మృతి

కొడిమ్యాల, జూలై 13: మండలంలోని నమిలకొండ గ్రామానికి చెందిన శాతరాజి సురేశ్ (39) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ రాజు వివరాల ప్రకారం.. సురేశ్ గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇద్దరు కొడుకులు కాగా, చిన్న కొడుకు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సురేశ్ కూడా అనారోగ్యం బారిన పడడంతో చికిత్స కోసం అప్పులు చేశాడు. శుక్రవారం కుటుంబసభ్యులతో కలిసి అత్తగారింటికి వెళ్లాడు. శనివారం ఉదయం ఒక్కడే ఇంటికి వచ్చాడు. ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రుద్రంగి: చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ రూరల్, జూలై 13: వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లి గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన్నట్లు తాజా మాజీ ఎంపీటీసీలు రంగు వెంకటేశ్‌గౌడ్, మల్లేశం పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో గ్రామానికి చెందిన గుంటి సత్తవ్వ, మౌనికలకు సీఎం సహాయనిధి మంజూరైంది పిణీ చేశారు. ఇక్కడ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు లంబ రాజుయాదవ్, తాళ్లపల్లి ప్రభాకర్, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, పరశురాములు, బర్మా మహేశ్, లంబ తిరుపతి, మనోహర్, అంజయ్య ఉన్నారు.

రుద్రంగి, జూలై 13: రుద్రంగి మండల కేంద్రంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన 6 చెక్కులను కాంగ్రెస్ డీసీసీ మెంబర్ చెలుకల తిరుపతి శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరువతో ఈ సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యాయని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్, సామ మోహన్‌రెడ్డి, అభిలాష్, యాదయ్య, నర్సరెడ్డి, గండి నారాయణ, హిరోజి, మనోజ్, శ్రీనివాస్, మల్లేశం, పంరంధాములు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో ?

- సేవాలాల్ తండా-ముస్తాబాద్ సీసీ రోడ్డుకు రూ. కోటి మంజూరు
- పనులు మొదలుపెట్టి మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- గుంతల దారితో నాలుగు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

గుంతలమయమైన సేవాలాల్‌తండా-ముస్తాబాద్ మట్టిరోడ్డు

ముస్తాబాద్ జులై 13: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా తయారైంది సేవాలాల్ తండా-ముస్తాబాద్ రహదారి నిర్మాణం. మట్టి రోడ్డు స్థానంలో కిలోమీటర్ మేర సీసీరోడ్డు వేసేందుకు గత బీఆర్ఎస్ సర్కారు రెండేండ్ల కిందట రూ. కోటి మంజూరు చేసింది. టెండర్లు సైతం పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే కాంట్రాక్టర్ ఆరు నెలల తర్వాత పనులు మొదలు పెట్టాడు. సగం వరకు పూర్తి చేసి వదిలేశాడు. దీంతోఇటీవల కురిసిన వర్షాలకు మట్టిరోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు గుండా నిత్యం ప్రయాణించే సేవాలాల్‌తండా, తెర్లుమద్ది, బట్టువానితాళ్లు, రాగంవాని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

పనులు వెంటనే ప్రారంభించాలి..

సేవాలాల్ తండా నుంచి ముస్తాబాద్‌కు వెళ్లే మట్టి దారిని సీసీ రోడ్డుగా మార్చాలని ఇక్కడి ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి మధ్యలోనే ఆపేశాడు. దీంతో వానకాలంలో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే భయమేస్తున్నది. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలి.

-కట్ట బాపురావు. (సేవాలాల్‌తండా)

గుంతలతో తీవ్ర ఇబ్బందులు..

సేవాలాల్ తండా నుంచి ముస్తాబాద్‌కు వెళ్లే మట్టి దారి స్థానంలో సీసీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ పనులు మాత్రం మొదలు కాలేదు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే ఈ దారి గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు అవస్తలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- ఈసరి కృష్ణ మాజీ సర్పంచ్ (తెర్లుమద్ది)

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, పోలీసుల దాడి

రాయికల్, జూలై 13: మండలంలోని రాజానగరం తండా, ధర్మాజీపేట, గాంధీ తండాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్, పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం పానకం, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్, జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్ఐ స్వప్న, రాయికల్ ఎస్ఐ అశోక్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి లోక బాపురెడ్డి పరామర్శ

కథలాపూర్, జూలై 13: మండల కేంద్రానికి చెందిన గడ్డం గంగారెడ్డి ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యులను శనివారం మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నాగం భూమయ్య, వర్ధినేని నాగేశ్వర్ రావు, కల్లెడ శంకర్ ఉన్నారు.

ఎమ్మెల్సీకి వినతి

జగిత్యాల, జూలై 13: రాష్ట్రంలో 61 ఏళ్లు పైబడిన 3797 మంది వీఆర్ఏల స్థానంలో దశాబ్ద కాలంగా విధులు నిర్వహిస్తున్న వారి అర్హతను బట్టి జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌లుగా నియమించి రెగ్యులర్ పేస్కేల్ అందించేలా చర్యలు తీసుకునేలా చూడాలని పట్టణంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్సీ స్పందించి ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ పంపారు.

వానరానికి అంత్యక్రియలు

మెట్‌పల్లి రూరల్, జూలై 13: మెట్‌పల్లి మండలం కొండ్రికర్లలో కరెంట్ షాక్‌తో మరణించి వానరానికి గ్రామస్తులు అంత్యక్రియలు చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయ సమీపంలో గల ఓ భవనంపైకి శనివారం కోతుల గుంపు వచ్చింది. భవనం పక్కనే గల విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలకు ఓ వానరం తాకడంతో షాక్ వచ్చి మృతిచెందింది. గ్రామస్తులు గడ్డం రాజిరెడ్డి, నారాయణగౌడ్, లింబయ్య, ఆకుల నవీన్ వానరానికి అంత్యక్రియలు చేశారు.

ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తా

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- సిరిసిల్ల దవాఖాన ఆకస్మిక తనిఖీ
- ఎమర్జెన్సీ వార్డుల పరిశీలన
- వైద్యశాలలోని సమస్యలపై ఆరా

దవాఖానలో చికిత్స పొందుతున్న రోగి బంధువుతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్

కలెక్టరేట్, జూలై 13: సిరిసిల్ల జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న వారికి రక్త (ఓ నెగెటివ్)దానం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రకటించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని ఎమర్జెన్సీ వార్డులు, బ్లడ్ బ్యాంక్, ఐసీయూ, మెటర్నిటీ వార్డ్, ఎస్ఎన్‌సీయూ, ఆపరేషన్ థియేటర్లు తదితర విభాగాలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంకులో రక్తం నిల్వలపై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తన రక్తం అందిస్తానని కలెక్టర్ పునరుద్ఘాటించారు. అనంతరం ఆయా విభాగాల్లోని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ రోజు విధుల్లో ఎంత మంది డాక్టర్లు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల చికిత్సకు అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతపై రోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. కాగా ఐసీయూ, ఎస్ఎన్‌సీయూలోని ఇబ్బందులను వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. దవాఖానలో నీటి సమస్య ఉన్నదని రోగులు తెలుపగా, పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్ఎంవో సాయి కుమార్, వైద్యులు వినీత, నికిత ఉన్నారు.

క్లాస్‌రూమ్ కథలు పుస్తకావిష్కరణ

క్లాస్‌రూమ్ కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హెడ్మాస్టర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

కలెక్టరేట్, జూలై 13: సిరిసిల్లకు చెందిన ప్రముఖ రచయిత్రి కందేపి రాణీప్రసాద్ రచించిన 'క్లాస్ రూమ్ కథలు' పుస్తకాన్ని జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాస్టర్ జీ.శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. శనివారం ఇంపొల్లులోని జడ్పీ పాఠశాలలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కాగా రచయిత్రి కందేపీ రాణీప్రసాద్ తాను చిన్నతనంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకోగా అదే పాఠశాలలో ఇపుడున్న టీచర్ల సమక్షంలో తాను రచించిన క్లాస్‌రూమ్ కథలు' పుస్తకావిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని సమాజానికి ఉపయోగపడే రచనలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే సునీల్, శ్రీధర్, విద్యార్థులు ఉన్నారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

జగిత్యాల రూరల్, జూలై 13: జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన వంగ సురేశ్(38) గుండెపోటుతో ఇరాక్‌లో మృతి చెందగా మృతదేహం శనివారం స్వగ్రామం చేరుకుంది. శవపేటికను చూసి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. సురేశ్‌కు భార్య వసంత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

జగిత్యాల టౌన్, జులై 13: బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని ఎల్ఎల్ గార్డెన్‌లో శనివారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ, బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి, జాయినింగ్ లెప్ట్ ఓవర్ పోస్టులు వెంటనే అర్హత గల ఉపాధ్యాయులతో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యాం సుందర్, అంబటి భూమేశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి మానుపాటి బన్నా, కార్యదర్శులు తులసీ, ఆగమయ్య, వైవీ ప్రసాద్, శ్రీధర్, మొలుగురి నరేశ్, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్ కొండ్ర అనిల్‌కుమార్, బల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కోరుట్ల, జూలై 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, కార్మిక సంఘం నేత బాల రాజు కోరారు. పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో శనివారం నిర్వహించిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులకు అనేక వాగ్దానాలు చేసినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. సమావేశంలో నాయకులు బోగ గోవర్ధన్, ముక్రం, మౌలానా, కడారి రాములు, కొక్కుల శాంత, అనసూయ, రంగారెడ్డి, లక్ష్మణ్, వేణు, భానుప్రసాద్, దేవదాసు, ఎన్నం రాధ, గోదావరి తదితరులు పాల్గొన్నారు.